తల్లికి వందనం హామీని నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళుతుంటే వారిందరికీ తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభించి ఇప్పటికే మూడు నెలలు కావస్తున్నాయి. ఇంతవరకు ప్రభుత్వం తల్లికి వందనం డబ్బు జమ కాలేదు. వీలైనంత త్వరగా ఇస్తే మాకు భరోసాగా ఉంటుంది.

– జి.లక్ష్మీలీల, ఎల్ఎన్‌పురం, ప్రైవేట్ పాఠశాల విద్యార్థి తల్లి, నందివాడ మండలం

రైతుకు సాయమేదీ?



గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభం కాగానే రైతులంతా వైఎస్సార్ రైతు భరోసా పేరుతో సాయం అందుకునేవారం. ప్రతి ఏటా ఈ విధంగా జగన్ ప్రభుత్వం రూ.13,500 పెట్టుబడి సాయంగా అందించేది. అధికారంలోకి వస్తే ఈ సాయాన్ని రూ.20 వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దీనిపై నోరు మెదపటం లేదు. దీంతో రైతు సాయంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

– అబ్దుల్ జబ్బార్, అల్లినగరం, మండవల్లి మండలం

నిరుద్యోగ భృతి ఏమైంది?



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలలో భాగంగా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తి అయినా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలైనా కల్పించాలి.. లేదంటే నిరుద్యోగ భృతి రూ.3వేలు కచ్చితంగా ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలి. లేకపోతే పాలకులపై నిరుద్యోగులు తిరగబడతారు.

– కె.పవన్‌కుమార్, చిరిచింతల, గుడివాడ మండలం

రూ.1,500 ఎప్పుడు ఇస్తారో అని ఎదురు చూస్తున్నాం



మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రూ.1,500 ఎప్పుడు ఇస్తుందోనని ఎదురు చూస్తున్నాం. అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయింది. ఇంత వరకు ఇవ్వలేదు. వీలైనంత త్వరగా ఇచ్చి ప్రభుత్వం మహిళలకు భరోసాగా నిలవాలి.

– ఎం.లక్ష్మి, గుడివాడ

నిరుద్యోగ భృతి కోసం చూస్తున్నాం



అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యావంతులైన ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా నిరుద్యోగభృతి అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ భృతి కోసం మాలాంటి నిరుద్యోగులు లక్షల మంది పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్నారు. అలాంటి వారందరూ ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆశిస్తున్నాం.


– సీహెచ్. వంశీ, ముదినేపల్లి

మహిళలకు రూ.1,500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు హోరెత్తించారు. అదే విధంగా సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చారు. వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తటం లేదు. హామీలు మరిచిపోతే ఎలా? నాతో పాటు మహిళలందరూ నెలకు రూ.1,500 వస్తాయని ఎదురు చూస్తున్నారు.

– కుందేటి రాణి, బల్లిపర్రు, పామర్రు



‘సూపర్ సిక్స్’కు గ్యారెంటీ లేదా!

గుడివాడ/పామర్రు/కైకలూరు: బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కదాన్నీ కూటమి ప్రభుత్వం ప్రారంభించలేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీయే నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ తమ ప్రసంగాల్లో సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టారు. అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేస్తామని చెప్పారు. ‘తల్లికి వందనం’ కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ‘అన్నదాత సుఖీభవ’ కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదంటే ఉద్యోగం వచ్చే వరకు ‘నిరుద్యోగ భృతి’ కింద నెలకు రూ.3 వేలు, ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 19–59 ఏళ్ల మహిళలకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఆశ పెట్టి వారి చేత ఓట్లు వేయించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు పూర్తయినా వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాలలు మొదలైనా ఇప్పటివరకు తల్లికి వందనం ఊసే లేదు. రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా రాలేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. సమయానికి లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం జమ అయ్యేలా చూసింది. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పట్లో వాటిని అమలు చేయలేమనే వ్యాఖ్యలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా అధికారం కోసమే ఇచ్చే ఉత్తుత్తి హామీల జాబితాలో వీటిని చేర్చుతారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- పథకాల కోసం ఎదురు చూపులు
- హామీలన్నీ అమలు చేయాలని ప్రజల డిమాండ్

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	గుడివాడ	18.14
	పామర్రు	32.65
	కైకలూరు	11.16



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా

	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
గుడివాడ	13,439	26.87 కోట్లు
పామర్రు	24,188	48.37 కోట్లు
కైకలూరు	13,403	26.80 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	గుడివాడ	15.92
	పామర్రు	31.72
	కైకలూరు	11.66



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా

	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
గుడివాడ	31,745	47.61 కోట్లు
పామర్రు	25,700	38.55 కోట్లు
కైకలూరు	31,111	46.66 కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా

	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
గుడివాడ	53,267	7.99 కోట్లు
పామర్రు	65,016	9.52 కోట్లు
కైకలూరు	85,535	12.83 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా

	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
గుడివాడ	69,000	20.70 కోట్లు
పామర్రు	56,543	16.96 కోట్లు
కైకలూరు	77,459	23.23 కోట్లు

రైతు భరోసా ఇచ్చేది ఎప్పుడు?



కూటమి అధికారంలోకి వస్తే రూ.20 వేలు రైతు భరోసా ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయింది. గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో జూన్ మాసంలోనే రైతుభరోసా చేతికందేది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతు భరోసా త్వరగా వేసి, సాగు కష్టాలు తొలగించాలి.

– పి.హరిప్రసాద్, రైతు, తోట్లవల్లూరు

‘తల్లికి వందనం’ వెంటనే అమలు చేయాలి



గత ప్రభుత్వ హయాంలో ఉన్న అమ్మ ఒడి పథకాన్ని మరింత అభివృద్ధి చేసి ఎంతమంది పిల్లలుంటే అందరికీ సాయమందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అయినా సంబంధిత నిధులు విడుదల చేయలేదు. మా పిల్లల భవిష్యత్తుపై మాకు బెంగ పట్టుకుంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా తల్లికి వందనం అమలు చేయాలి.

– పి.పెద్దింట్లమ్మ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థి తల్లి, వడాలి, ముదినేపల్లి మండలం

ఆడబిడ్డకు సాయం ఎప్పుడు ఇస్తారు?



అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 వంతున సాయం అందిస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కూటమి నాయకులు ఈ విషయంపై ముమ్మరంగా ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయినా ఈ సాయంపై ప్రభుత్వం మౌనంగా ఉండడం అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇచ్చిన హామీ ప్రకారం సాయమందించి మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలి.

– జి. సామ్రాజ్యం, లింగాల, మండవల్లి

క్లుప్తంగా

కాంట్రాక్ట్ నర్సులను పర్మినెంట్ చేయాలి

గుడివాడ టౌన్: తమను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఏఎన్‌ఎంలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారిని స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు ఇవ్వడానికి జీఓను జారీ చేయడం విచారకరమన్నారు. ఎన్నో ఏళ్లగా కాంట్రాక్ట్ పద్ధతిపై స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమకు ఈ విధానం పూర్తిగా అన్యాయం చేస్తుందన్నారు. తక్షణమే జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: స్థానిక సచివాలయంలోని పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందుల పంపిణీ చేశారు. ఎంపీడీఓ డి.కృష్ణవేణి, గ్రామ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

పంట నష్టం జాబితాల ప్రదర్శన

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాలతో మండలంలోని అనేక గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. ఇందుకు సంబంధించి సచివాలయాలవారీగా నష్టపోయిన రైతుల జాబితాలను ఆయా సచివాలయాల్లో ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలుంటే స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని అధికారులు తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ గాయిత్రి

గుడివాడరూరల్: చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని గుడివాడ అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.గాయిత్రి సూచించారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాసంస్థ ఉత్తర్వుల ప్రకారం పట్టణంలోని నారాయణ కళాశాల్లో బుధవారం నిర్వహించిన న్యాయసేవా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాలలో జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేయటం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి సంఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఉండాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా కష్టపడి చదువుకోవాలని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదవడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహనరావు, ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్, ఏఎస్ఐ నరసింహారావు, న్యాయవాది రఫీ పాల్గొన్నారు.

నాట్కో సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రాము, బ్రహ్మారెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను గుడివాడ, మాచర్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో రాము మాట్లాడుతూ ఏపీలో పెద్ద ఆస్పత్రిగా గుంటూరు జీజీహెచ్‌కు పేరుందన్నారు. ఇదే మాదిరిగా గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేయడానికి గుంటూరు జీజీహెచ్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం స్టాఫ్ నర్సుల తమ సమస్యలపై ఎమ్మెల్యే రాముకు వినతి పత్రాన్ని సమర్పించారు. నాట్కో సమన్వయకర్త వై.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు

మొవ్వ: బ్రిటిష్ కాలం నుంచి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న పోడియం తొలగించి సిబ్బందితో కలసి విధులను నిర్వహించే విధానం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమైంది. రాచరికపు పోకడలను రద్దు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిన నేపథ్యంలో పోడియం ద్వారా విధులు నిర్వర్తించే విధానానికి స్వస్తి పలికారు.

కూటమి ప్రభుత్వం సాధించిందేమీ లేదు



పమిడిముక్కల: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం మినహా సాధించిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. మండలంలోని హనుమంతపురం గ్రామంలో బుధవారం రాత్రి పర్యటించారు. మండవ జనార్దనరావు, పామర్తి గౌతు కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజులు గడిచినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకునే పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు ప్రచారం తప్ప వరద బాధితులకు చేసిందేమీ లేదన్నారు. గ్రామాల్లో పేకాటలు మాత్రం బాగా జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, సర్పంచ్‌లు కలపాల రాంబాబు, కోట మణిరాజు, నాయకులు రాంబాబు, ఆనంద్, రమేష్, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ



జాన్‌బాబును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో తమ విద్యార్థి బంగారు పతకం సాధించినట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర బాబు తెలిపారు. కళాశాల కార్యాలయంలో విజయం సాధించిన పెద్ది జాన్‌బాబును బుధవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14, 15 తేదీలలో కోనసీమ జిల్లాలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కస్సెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుట్టా మోహన్ సేవలు చిరస్మరణీయం

కైకలూరు: పార్టీ అభివృద్ధికి దివంగత దుట్టా మోహన్‌రావు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పల్లెవాడలో మోహనరావు ప్రథమ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు బంటుపల్లి సాదు కొండయ్య, నాయకులు అశోక్, దాస్, కలిదిండి వైస్ ఎంపీపీ కనక దుర్గారాణి పాల్గొన్నారు.

నేడు శ్యామ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఎల్ఎల్‌పీ ప్రారంభం

కురుమద్దాలి(పామర్రు): కురుమద్దాలిలో నిర్మించిన శ్యామ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఎల్ఎల్‌పీని గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ చేత వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నట్లు వెలగపూడి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ వెలగపూడి సాంబశివరావు బుధవారం పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కేంద్ర స్టీల్ అండ్ హెవీ ఇండ్రస్ట్రీస్ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా వారాహి అమ్మవారి హోమం

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఆలయంలో బుధవారం భక్తులు వారాహి అమ్మవారి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

మండవల్లి: మణుగునూరులోని ముంపు ప్రాంతాల్లో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు బుధవారం నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. సీపీఎం నాయకుడు మంతెన సీతారాం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడు సచివాలయ పరిధిలోని గర్భిణులకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.



ప్రకటన

అన్నసమారాధన



ఆదివినాయక దేవాలయం వద్ద వడ్డన చేస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కైకలూరు బైపాస్ రోడ్డు వద్ద ఆదివినాయకస్వామి ఆలయం వద్ద 35వ వార్షికోత్సవం సందర్భంగా మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ ఊరేగింపుతో వెళ్లి స్వామివారిని కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రామారావు, కొండయ్య, త్రిమూర్తులు, శ్రీనివాసరావు, అయ్యప్ప, మహేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.